ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 26 నవంబరు 2025 www.prajaswaramdailly.com 4 pm

# నవీన్ యాదవ్ ప్రమాణం

**జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేయించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**హాజరైన ప్రజాప్రతినిధులు**

**ఆనందం వ్యక్తం చేసిన కుటుంబసభ్యులు**



**హైదరాబాద్, ప్రజాస్వరం :** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆయనతో ప్రమాణం చేయించారు. నవీన్ ప్రమాణ స్వీకారాన్ని చూసిన ఆయన కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్ లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. నవీన్ యాదవ్ అనే నేను.. అంటూ మొదలుపెట్టారు. ఆయన ప్రమాణ స్వీకారానికి పలువురు మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రి అజారుద్దీన్, మేయర్, డిప్యూటీ మేయర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, నవీన్ యాదవ్ కుటుంబ సభ్యులు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వంటి నేతలు హాజరయ్యారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య పోరు సాగింది. కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలోకి దిగిన నవీన్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల తేడాతో గెలుపొందారు.

# హైదరాబాదులో బోర్డు తిప్పేసిన ఐటీ కంపెనీ




**హైదరాబాద్, ప్రజాస్వరం :** హైదరాబాదులో మరో ఐటీ కంపెనీ బోర్డు తిప్పేసింది. మాదాపూర్ లోని ఎన్ఎస్ఎన్ ఇన్ఫోటెక్ ఘరానా మోసానికి పాల్పడింది. ఉద్యోగ అవకాశం పేరుతో 400 మంది నుంచి .. సుమారు రెండు నుంచి మూడు లక్షలు వసూలు చేసింది. కంపెనీ యజమాని స్వామి నాయుడు పరారీలో ఉన్నాడు. ఘటనపై కేసు నమోదు చేసుకొని మాదాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నకిలీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారి అరెస్టు




**హైదరాబాద్, ప్రజాస్వరం :** నకిలీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను వెస్ట్ జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ విలేకరులకు వెల్లడించారు . ఫేక్ ఆఫీసర్ ను ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు ఐఏఎస్, ఐపీఎస్ పేరుతో బెదిరింపులు , మోసాలకు పాల్పడుతున్నాడు. బుధవారం (నవంబర్ 26) అరెస్టు చేసిన ఫిలింనగర్ పోలీసులు.. నిందితుడి నుంచి నకిలీ ఐడీ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

బత్తుల శశికాంత్ ఒక నకిలీ అధికారి. షేక్ పేట్ పరిధిలో ఒక జిమ్ లో బాడీ గార్డ్స్ ను చూపించి ఇద్దరి దగర 18 లక్షల రూపాయలు తీసుకున్నాడు. నిందితుడి నుంచి 2 మొబైల్ ఫోన్స్, ఆరు సిమ్ కార్డ్స్, ఇతర గాడ్జెట్స్ తో పాటు ఫేక్ ఐడీ కార్డ్స్ సీజ్ చేశారు.. గన్ లైసెన్స్ కలిగిన రిటైర్డ్ ఆర్మీ వ్యక్తులను బాడీ గార్డ్స్ గా నియమించుకుని సైరన్ వాహనంలో తిరిగే వాడని తెలిపారు. ఫేక్ఐడీ కార్డ్స్ ను క్రియేట్ చేసి అధికారిగా గా చెలామణి అవుతున్నాడు. నిందితుడు బత్తుల శశికాంత్ కు గార్డ్స్ గా ఉన్న ఇద్దరిని త్వరలోనే పట్టుకుంటాం అని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

# ఏరోస్పేస్, ఏవియేషన్ హబ్‌గా హైదరాబాద్

## సీఎం రేవంత్ - సాఫ్రాన్ సంస్థ ఏఈఎస్ఎఫ్ ప్రారంభం




హైదరాబాద్ , ప్రజాస్వరం : హైదరాబాద్-బెంగుళూరు నగరాలను డిఫెన్స్-ఏవియేషన్ కారిడార్ గా ప్రకటించాలని సీఎం రేవంత్ రెడ్డి .. కేంద్రాన్ని కోరారు ఏరోస్పేస్ , ఏవియేషన్ విభాగాలకు హబ్ గా హైదరాబాద్ మారుతోందన్నారు. ఏవియేషన్ కు చెందిన ఎన్నో సంస్థలు ఇప్పటికే హైదరాబాద్ లో ఉన్నాయని గుర్తు చేశారు.

శంషాబాద్ లోని జీఎంఆర్ ఏరోపార్క్ లో సఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా లీప్ ఇంజిన్ ఎంఆర్ఓ కేంద్రం ప్రారంభోత్సవంలో ఎం88-ఎంఆర్ ఓ కేంద్రానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు సాఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఫెసిలిటీని ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు . సాఫ్రాన్ సంస్థ హైదరాబాద్ ను ఎంచుకున్నందుకు సీఎం రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నగర అభివృద్ధికి మరింత దోహదం చేస్తున్న దన్నారు. ఏవియేషన్ రంగానికి చెందిన ఎంతో మంది నిపుణులు ఉన్నారని తెలిపారు. ఆ సంస్థకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు ప్రభుత్వం రెడీగా ఉందన్నారు. డిసెంబర్ 8, 9న జరిగే గ్లోబల్ సమ్మిట్ కు హాజరుకావాలని ప్రధాని నరేంద్రమోదీని ఆహ్వానించారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని, ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామనీ వివరించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.



**ఏవియేషన్ సెక్టార్ వేగంగా అభివృద్ధి : మోదీ**

అంతకుముందు ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడారు. కేంద్రం నుంచి సాఫ్రాన్ సంస్థకు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కొన్నేళ్లుగా ఏవియేషన్ సెక్టార్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. భారత్ 1500 ఎయిర్ క్రాఫ్ట్ లకు ఆర్డర్ ఇచ్చిందని, ఎయిర్ క్రాఫ్ట్ ల సర్వీస్ సెంటర్ ఏర్పాటు కావడం ఎంతో ఉపయోగకరమన్నారు. పలు రంగాల్లో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. జీఎస్టీలో సంస్కరణలు తీసుకొచ్చి పన్నుల భారాన్ని తగ్గించామన్నారు. కొత్తగా నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేస్తూ, కార్మికులకు మేలు చేస్తున్నట్లు వివరించారు.

**ఎయిర్ క్రాఫ్ట్ ల ఖర్చు తగ్గుతుంది**
**: పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు**



భవిష్యత్తులో ఎయిర్ క్రాఫ్ట్ ల తయారీ ఖర్చు భారీగా తగ్గుతుందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. సాఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఏర్పాటు వల్ల భవిష్యత్తులో ఎయిర్ క్రాఫ్ట్ ల తయారీ ఖర్చు తగ్గుతుందన్నారు. దీనివల్ల ఆ లాభం ప్రయాణికులకు బదిలీ అవుతుందన్నారు. ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ కోసం సింగపూర్ -మలేసియా వంటి దేశాలపై ఆధారపడుతున్నామని, భారత్ లో అలాంటి సర్వీసెస్ ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. ప్రధాని మోదీ చేపట్టిన ఆత్మనిర్భర్ భారత్ వల్లే సాధ్యమవుతోందని వివరించారు.

# అంబర్‌పేట్ ఎస్ఐ కేసులో షాకింగ్‌వాస్తవాలు


**బంగారం నొక్కేసి లోక్ అదాలత్‌లో కేసు క్లోజ్..**

**తుపాకీ ఎక్కడ తాకట్టు ?**

**అంబర్ పేట , ప్రజాస్వరం : హైదరాబాద్ అంబర్‌పేట్ ఎస్ఐ కేసులో దర్యాప్తు చేస్తున్నాకొద్దీ షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎస్ఐ భానుప్రకాశ్ బరితెగింపు పోలీస్ శాఖ ప్రతిష్ఠకు మచ్చ తెచ్చేలా మారింది. ఎస్ఐ తన సర్వీస్ రివాల్వర్‌ను తాకట్టు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఓ చోరీ కేసులో రికవరీ సొమ్ముకూడా వాడుకున్నట్లు, బంగారంను తాకట్టు పెట్టినట్లు భానుప్రకాశ్ పై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎస్ఐను సస్పెండ్ చేశారు. భానుప్రకాశ్‌పై అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.**

ప్రస్తుతం ఆయన్ను టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

పోలీసుల విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రికవరీ బంగారంను నొక్కేసి లోక్ అదాలత్ లో కేసు క్లోజ్ చేసినట్లు పోలీసు అధికారులు గుర్తించారు. దీంతో ఐదు తులాల బంగారం రికవరీ చేసి సొంతంగా వాడుకున్నట్లు తేల్చారు. సర్వీస్ 9ఎంఎం పిస్టల్ మిస్సింగ్ వ్యవహారం పోలీసు శాఖలో కలకలం రేపుతోంది. తుపాకీని రాయలసీమ ముఠాలకు అమ్మేశాడా..? దానిని ఎక్కడ తాకట్టు పెట్టాడు అనే విషయాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. డ్రాలో బుల్లెట్స్ మాత్రమే ఉన్నాయి. తుపాకీ కనిపించలేదు. ఎస్ఐ భాను ప్రకాశ్ బెట్టింగ్‌లకు బానిసై భారీగా అప్పులపాలైనట్లు తెలుస్తోంది. సుమారు 70 నుంచి 80లక్షల మేర అప్పుల్లో కూరుకుపోయినట్లు సమాచారం. దీంతో ఆయన ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు అడ్డదారులు తొక్కాడు. ఓ రికవరీ కేసులో స్వాధీనం చేసుకున్న సుమారు ఐదు తులాల బంగారాన్ని తన సొంత అవసరాలకు వాడుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. భాను ప్రకాశ్ ను విచారించే క్రమంలో సర్వీస్ రివాల్వర్ కూడా కనిపించక పోవటంతో ఆ విషయంపై ప్రశ్నించారు. అతను పొంతనలేని సమాధానాలు చెప్పడంతో కేసు నమోదు చేశారు. ఆ తరువాత లోతుగా విచారించగా.. బంగారంతోపాటే తుపాకీని కూడా ఓ బ్రోకర్ వద్ద తాకట్టు పెట్టి ఉండొచ్చనని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్సై భానుప్రకాశ్ వ్యవహారంలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.



# ప్రియురాలు మోసం చేసిందని..

## సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్య



**హైదరాబాద్: ప్రజాస్వరం :** ప్రేమించిన యువతి మోసం చేసిందనే తీవ్ర మనస్తాపంతో ఓ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇన్ఫోసిస్ కంపెనీలో పనిచేస్తున్న పవన్ కల్యాణ్ రెడ్డి (26) ఇంట్లో ఫ్యాన్ కు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు.

గుంటూరు జిల్లాకు చెందిన పవన్ కల్యాణ్ రెడ్డి, పోచారంలోని సంస్కృతి టౌన్ షిప్ లో తన స్నేహితులతో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తూ నాలుగేళ్లుగా ఇన్ఫోసిస్ లో ఉద్యోగం చేస్తున్నాడు. అతను కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఇటీవల ఆ యువతి వేరొక వ్యక్తితో ఉన్న ఫొటోలు చూసి పవన్ కళ్యాణ్ రెడ్డి అనుమానం పెంచుకున్నాడు. ఆ ఫొటోలను యువతి కుటుంబ సభ్యులకు పంపించాడు. యువతి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లో కల్యాణ్ పై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. రెండు రోజులుగా ఆమె ఫోన్ కు స్పందించకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురైన అతను, సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని అతని స్నేహితులు తండ్రి శ్రీనివాస్ రెడ్డికి తెలిపారు. నిన్న నగరానికి చేరుకున్న తండ్రి, ప్రేమించిన యువతి మోసం చేయడం వల్లే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోచారం ఐటీ కారిడార్ పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# టాలీవుడ్ డైరెక్టర్ సంపత్ నంది తండ్రి మృతి



**హైదరాబాద్, ప్రజాస్వరం** డైరెక్టర్ సంపత్ నంది తండ్రి కిష్టయ్య(73) మంగళవారం రాత్రి కన్నుమూశారు. తెలంగాణలోని ఓదెల సంపత్ నంది స్వస్థలం. వయసు రీత్యా ఆరోగ్య సమస్యల కారణంగా నంది కిష్టయ్య తుదిశ్వాస విడిచినట్లు తెలిపిన కుటుంబ సభ్యులు తెలిపారు. రామ్ చరణ్ తో 'రచ్చ', రవితేజతో 'బెంగాల్ టైగర్ సినిమాల కు డైరెక్టర్ గా పనిచేశారు.

# భర్తను హతమార్చిన భార్య




**జగిత్యాల ప్రజాస్వరం :** కుటుంబ కలహాలతో భర్తను భార్య రోకలి బండతో కొట్టి ఆపై కత్తితో నరికి చంపింది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో దారుణం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మల్లాపూర్ కు చెందిన మల్లయ్య అతని భార్యతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలు, వాగ్వాదంతో భార్య కోపం తీవ్రరూపం దాల్చింది. మొదట రోకలి బండతో భర్త తలపై దాడి చేసింది. అతను నేలకూలగానే, మెడపై కత్తితో నరికి చంపినట్లు తెలిసింది. మల్లయ్య తరచూ మద్యం తాగి భార్యను వేధించేవాడని, ఇదే కారణంగా భార్య ఈ దారుణానికి ఒడిగట్టిందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.